# అసంతృప్తి

అది పెద్ద నగరం...అయినా అక్కడ మాత్రం మారుమూల పల్లెలాంటి వాతావరణం. హైవే మీంచి ఆ కొండవరకూ వచ్చే మట్టి రోడ్డు తప్ప ఆ చుట్టుపక్కల మరో రోడ్డు కూడా లేదు. ఆ రోడ్డేనా ఆ కొండమీది తన బంగళా కోసం భూషణం వేయించుకున్నదే.

వి. రాజా రామమోహనరావు

భూషణానికి జీవితం చాలా సుఖాన్నిచ్చింది. తండ్రి వల్ల సంక్రమించిన అంతస్తు, ఆస్తి కాక కొన్నేళ్ళపాటు వేలం వెర్రిగా రకరకాల వ్యాపారాలు చేసి, రాత్రింబవళ్ళు శ్రమించి విపరీతంగా డబ్బు సంపాదించాడు. ఉన్న ఆస్తిని పదింతలు చేసుకున్నాడు. ఆ రోజుల్లో కొన్నదే ఆ కొండ వున్న వంద ఎకరాల తోట. ఖాళీ దొరికిన కాస్త సమయాన్ని ఆనందానికి, సంతోషానికే కేటాయించాడు. అన్ని రకాల సదుపాయాలూ సమకూర్చుకున్నాడు. చాలా ఏళ్ళు పరుగులాంటి అతని జీవితం, సాంఘిక వేగాన్ని అనుభవిస్తున్న సంతోషాన్నిచ్చింది. చక్కటి గాలి లోని సౌఖ్యం, మృదువైన కదలికలోని ఆనందం తెలియని వాడికి...ఎత్తుమీద నిలబడ్డంలోని అహం, వేగంలోని పొగరుమోత్తనం తెలిస్తే ఎలా వుంటుందో అలా గడిచింది భూషణం జీవితం చాలా ఏళ్ళు.

నలభైకి దగ్గర పడుతున్న నయసులో ఓ రాత్రి రెండు గంటల వేళ తొలిసారిగా చాలా భయపడ్డాడు భూషణం. గొంతుకెండిపోతున్నట్టు...వూపిరి ఆడనట్టు చాలా యాతనపడ్డాడు. వెంటనే డాక్టరు రావడం, ఉపశమనం కలిగించడం వరసగా నాలుగు రోజులు అన్ని పరీక్షలు జరిపించి, పెద్ద అనారోగ్యం ఏమీ లేదని తేల్చటం జరిగినా భూషణాన్ని ఆ రాత్రి భయం వదల్లేదు. ...ఆ రాత్రి భయం పూర్తిగా చావు భయం కాదు. కానీ ఆ భయం భూషణం జీవితపు ముందు వెనుకల్ని కుదిపి కుదిపి తీవ్రంగా ప్రశ్నించింది. కొంత విశ్రాంతి తీసుకుంటే మంచిదని, మానసికంగా, శారీరకంగా కొంత మార్పు వుండేలా వ్యాపకాల్ని తీర్చి దిద్దుకుంటే అన్ని రకాలుగా ఉత్సాహంగా వుంటుందని డాక్టరు చెప్పడంవల్ల భూషణం కాస్త తీరుబడిగా ఆలోచించాడు.

కొన్నాళ్ళు అతను ఏ పనీ చెయ్యకుండా పూర్తి కులాసాగా గడిపినా నష్టం లేదు. అతని పెట్టుబడులు లాభాల్ని ఆర్జిస్తూనే వుంటాయి. అదీకాక...'తన జీవితాన్ని ఇలా డబ్బు పరుగులా ఏ శక్తి మార్చింది? అని ప్రశ్నించుకుంటే అతనికి ఇదమిత్థమైన సమాధానం దొరకలేదు. వారసత్వమా? పుట్టి పెరిగిన పరిసరాలా? మనస్తత్వమా? డబ్బు సుఖం తాలూకు పిచ్చి రుచా? ఇవన్నీ కారణాలే...అలా అని ఇదే కారణం అని బలంగా చెప్పగలిగిందీ లేదు. అతనికి మొదటి సారిగా అప్పటి జీవితం మీద విసుగు కలిగింది.

జీవితంలో మార్పు...సుఖంలో మార్పు అన్న ఆలోచన స్థిరపడిన దగ్గర్నించీ చాలా పనులు చకచకా చేయించాడు భూషణం. నగరానికి, జనానికి దూరంగా ఆ కొండ దగ్గరికి, ఆ తోటకి వచ్చేశాడు. కొండమీద బంగళా కట్టించాడు. బంగళాలో అన్ని వసతులు ఏర్పాటు చేసుకున్నాడు.

అతను నగరానికి దూరంగా వున్నా...నగరం అతనికి దూరంగా లేదు. సిటీ తాలూకు అన్ని సౌఖ్యాలు అతనికి అందుబాటులోనే వున్నాయి. మరీ అంత ఎత్తులేని ఆ కొండ మీద జీవితాన్ని అతనలా ఏర్పాటు చేసుకున్నాడు. సౌకర్యాలే కాదు అతని సమయం కూడా అతను చెప్పినట్టువింటుంది ఆ బంగళాలో. ఏ హడావిడీ లేదు. ప్రత్యేకించి అదే సమయానికి చేసి తీరాలి అన్న పనులూ లేవు. విశ్రాంతీ...సరదా...అదీ భూషణం యిప్పుడు ఆ బంగళాలో గడుపుతున్న జీవితం.

అలా అని ఇప్పటి భూషణం జీవితంలో అసంతృప్తి లేదా అంటే...వుంది...గతంలో కన్నా ఎక్కువగా వుంది. అసంతృప్తి అనుభవం తెలుస్తోంది భూషణానికి. కానీ దానికి కారణం ఏమిటో తెలియడం లేదు. రకరకాల శాఖాహారాలు కడుపునిండా తిన్న పెద్దపులిలా వుంది అతనికి ఆ అసంతృప్తి.

పడగ్గదిలో చల్లగా వుందనిపించటంతో బాల్కనీలోకి వచ్చాడు భూషణం. వెలుగు తేటగానే వున్నా, ఎండ బద్ధకంగా వుందనిపించింది భూషణానికి. చూపు సాగినంత దూరం చూశాడు. మామూలుగా ఎప్పుడూ కళ్ళబడే పరిసరాలే. దూరంగా హైవే మీద కదిలే వాహనాలు తప్ప పెద్ద సంచారం లేదు.

కొండ దిగువన మట్టి రోడ్డు హైవే వేపు తిరిగే మలుపులో చిన్న పాక...ఆ పాక అక్కడ కట్టుకుంటున్నారని భూషణానికి తెలుసు. ఆ కట్టుకుంటున్నది ఎవరో కూడా వెంకట్రావు చెప్పాడు కానీ భూషణానికి గుర్తు లేదు. ఇప్పుడు దాని వేపు పరీక్షగా చూస్తే తప్ప ఆ పాకలోకి ఎవరో వచ్చేశారన్నది తెలియలేదు.

ఈ పరిసరాల్లో మరో సంసారం అన్న ఆలోచనకి నవ్వొచ్చింది భూషణానికి. తనకి ఏ రకమైన అడ్డూ ఆటంకం వుండకూడదని యిలా ఒంటరి చోటుకి వచ్చాడు. నిజానికి అతను తలుచుకుంటే ఏదీ ఆటంకం కాదు. కానీ నిష్పూచీగా వుండాలన్న భావనే అతని ఒంటరితనం వుద్దేశం. అతని వుద్దేశాలకి అనుగుణంగా సరైన సమయానికి దొరికాడు మిత్రుడు వెంకట్రావు. ఎప్పుడో కాలేజీలో కలిసి చదువుకున్న స్నేహితులు యిద్దరు. ఇప్పుడు యిద్దరూ చనువుగానే వున్నా వారిద్దరి మధ్యా బలంగా వున్నది...పరోక్షంగా ఉభయ తారకంగా వున్నదీ యజమానీ సేవక బంధమే.

నగరానికి దూరంగా వున్న ఆ బంగళాకి భూషణం అవసరాలన్నింటినీ సదుపాయంగా కూర్చి పెట్టటం వెంకట్రావు ముఖ్య ఉద్యోగం. సరైన సంపాదన లేక అవస్థపడుతున్న వెంకట్రావుకి భూషణం యిప్పటి జీవితం మంచి అనువుగా వుంది.

ఆ బంగళా కడుతున్నప్పుడూ ఇప్పుడూ కూడా వెంకట్రావు పదీ పాతిక్కీ కక్కుర్తిపడుతున్నాడని అనుమానం వున్నా భూషణం ఆ విషయం పెద్దగా పట్టించుకోదలుచుకోలేదు. అవసరం తీరటం ప్రధానం. అందుకు రామబంటులా అనుకూలంగా వున్నాడు వెంకట్రావు.




వెంకట్రావుకీ బాగానే వుంది. ఉండటానికి నగరంలో అన్ని సదుపాయాలతో ఇల్లిచ్చాడు భూషణం. నెల నెలా జీతం యిస్తున్నాడు. ఎటొచ్చీ స్నేహితుడిగా బతకాల్సిన బతుకు బతకడం లేదు. అప్పుడప్పుడు అదే బాధగా వుంటుంది. అంతకన్నా బాధ ఒక్కోసారి భూషణం ప్రవర్తన, మాటలూ కలిగించినా భరించటానికే అలవాటు పడ్డాడు వెంకట్రావు.

ప్రత్యేకమైన ఉద్దేశం ఏం లేకుండా అలా ఆ పాకవేపు కాలక్షేపంగా చూస్తున్న భూషణానికి ప్రత్యే కంగా కనిపించింది సీత. సాయంత్రం ఆరింటికి వెంకట్రావు వచ్చేలోపు భూషణం పాక దాకా వెళ్ళి సీతని పరీక్షగా చూసి వచ్చాడు.

వెంకట్రావు వచ్చి రాగానే సీత వివరాలు తెలుసుకోవడానికి భూషణానికి ఎంతో సేపు పట్టలేదు. సీత భర్త రామారావు సిటీలో రెండొందల రూపాయిల వుద్యోగం చేస్తున్నాడు. రామారావు వెంకట్రావుకి దూరపు బంధువు. నగరంలో అద్దెకి తట్టుకోలేని దుస్థితి చూసి ఇక్కడ ఇలా వుండటానికి ఈ పాక ఏర్పాటు చేశాడు వెంకట్రావు. నగరానికి దూరమే అయినా సబర్బన్ బస్ పాస్ కొనుక్కుని రోజూ రెండు గంటలు పోనూ రెండు గంటలు రానూ ప్రయాణం చేసి రామారావు ఉద్యోగం చేస్తున్నాడు.

భూషణం జీవితంలో ఆడవాళ్ళకి లోటు లేదు. ఇప్పటికీ ఆ బంగళాలో ప్రతి రాత్రి ఏదో వినోదం, సందడి, సంతోషం వుంటూనే వున్నాయి. అయినా అతనికి సీత మీద మనసు పోయింది. చాలాసార్లు ఆ పాక పరిసరాల్లో తిరిగాడు. సీతని ఒంటరిగానే కాక రామారావుతో పాటు వున్నప్పుడూ చూశాడు.



కలవరింత

"ఈయన పిల్లలు పేల్చిన టపాసుల మోతకి జడుసుకుని ఒకటే కలవరింతలు, జ్వరం. ఎంత ఖర్చయినా ఫర్వాలేదు, భూతవైద్యం చేయండి సిద్ధాంతిగారూ."

— ఎం. కరుణ ప్రభాకర్, విజయవాడ

ఆ ఒంటరి పరిసరాల్లో సీత నిత్యం కంటికి కనిపించడంవల్లో, విచిత్రమైన ఒంటరితనంలో మేమిద్దరమే ఈ ప్రాంతంలో స్త్రీ పురుషులం అన్న గిలిగింతవల్లో రామారావుని కంటి చూపులతోటే, కొద్ది మాటలతోటే తను చెప్పిన ప్రతి మాట వినే భర్తగా అదుపు చేస్తున్న సీత జాణతనాన్ని మరో పది రకాలుగా ఊహించుకోవడం వల్లో మొత్తానికి సీతంటే పిచ్చి కోరిక పుట్టింది భూషణా నికి.

ఆ జంట ఆర్థిక దుస్థితి భూషణానికి తెలుస్తూనే వుంది. అందుకే సీత కంటపడిన వారం రోజులకే తిన్నగా వెంకట్రావునే అడిగేశాడు భూషణం, సీతని వీలైతే కుదిర్చి పెట్టమని.

అనుకోని ఆ పరిణామానికి ఆశ్చర్యపోయాడు వెంకట్రావు.

ఆ తడబాటుని తట్టుకోటానికి కొంత సమయం పట్టింది. తేరుకున్నాక తన శాయశక్తులా నచ్చచెప్పాడు భూషణానికి.

"ఆడవాళ్ళకి నీకు లోటు లేదు. ఏదో పేద జంట అలా బతకనీ. అయినా ఆ అమ్మాయిలో ఏముంది చెప్పు. నీకు తగిన మనిషి కాదు. నీ చిన్ని సరదా కోసం ఆ కాపరంలో కలతలొస్తాయి" అని రకరకాలుగా చెప్పాడు వెంకట్రావు.

"సారీరా వెంకట్రావ్, సీత మీద తట్టుకోలేని కోరిక వల్ల నీతో చెప్పేశాను. కానీ, నిజానికి నీతో చెప్పాల్సిన విషయం కాదు. ఎంతైనా వాళ్ళు నీకు బంధువులు. నువ్వింకే గొడవ వదిలేయి. కానీ ఒక్క విషయం. సీతని చూస్తే నాకు ఆశగానే వుంది. నా ప్రయత్నాలు నేను చేసుకుంటాను. ఏది ఏం జరిగినా వాళ్ళ సంసారం బాగుపడుతుందే తప్ప, నేనేం పాడు చెయ్యను... సరేనా" అన్నాడు భూషణం.

'సరే' అనక వెంకట్రావు చెయ్యగలిగిందేం లేదు.

ఎన్నో సాధించిన భూషణానికి సీత వ్యవహారం పెద్ద కష్టమేం కాలేదు. రెండు రోజులు మాట్లాడాడు. మూడవ రోజు సీత ఇబ్బందులు, ఆశలు గ్రహించాడు. ఆమె జీవితంలో వున్న లోటు స్పష్టంగా తెలియగానే మాటిగా తన వ్యవహారం సాధించుకున్నాడు.

పొద్దున్నే రామారావు వెళ్ళిందగ్గర్నించీ తిరిగి రాత్రి వచ్చేవరకూ అడ్డూ ఆటంకం లేని సమయం. రెండు రోజులకే భూషణం తమకం తీరిపోయింది.

ఆ తర్వాత మళ్ళీ భూషణం జీవితం మామూలే. మరో లోకంలా, ఆ పరిసరాల్లో వన దేవతలా సాదా సీదాగా వున్న సీతతో చాలా గొప్పగా అపురూపంగా వుంటుందనుకున్న అనుభవం మిగిలిన ఆడవాళ్ళలాగే వుంది. కొద్దిపాటి తేడా వుందనిపించినా అది భూషణం మనసులోకి యింకలేదు.


దప్పిక తీరుతోంది. చల్లగానే వుంది. అయినా దారీ తెన్నూ లేని ఎడారి ప్రయాణంలా వుంది భూషణానికి. ఆ అలజడితోనే ఆ రాత్రి వెంకట్రావుతో సీత తాలూకు అనుభవం గురించి చెప్పేశాడు.

అంతా విన్న వెంకట్రావుకి అన్ని రకాలుగా బాధే అనిపించింది.

ఆ జంటని అక్కడికి తీసుకొచ్చి సహాయంకన్నా అన్యాయం చేశాడేమోనన్న మథన పట్టుకుంది. ఏం చెయ్యాలో పాలుపోని స్థితి.

చివరికి ఏం జరిగితే అదే జరుగుతుందని తిన్నగా సీతతోటే మాట్లాడాడు వెంకట్రావు. అతని మథన, కోపం అంతా విని నెమ్మదిగా నవ్వింది సీత.

"ఈ విషయంలో మీరు పెద్దగా మనసు పాడు చేసుకోకండి. ఇంక భూషణం నా జోలికి రాడులెండి. వచ్చినా నష్టం లేదు. నేను కన్యగా ఇష్టపడి చేసుకున్న పెళ్ళి కాదు మాది. కానీ చేసుకున్నాక ఇష్టంగానే వుండాలన్న పుట్టెడు కోరిక. కానీ వీలు కావడం లేదు. నగరంలో అనేక చోట్ల వున్నాం. ప్రతి చోటానిదే బాధ. ఇక్కడ ఆ బాధ లేదని ఎంతో సంతోషించాను. కానీ రోజుకి పద్నాలుగు గంటలు ఆయన పడే శరీర శ్రమ, శవంలా వచ్చి ఈ పాకలో పడి నిద్దరపోయి, తిరిగి శవంలా ఆ చాకిరీకి వెళ్ళే ఆయన బాధ చూడలేకపోతు



న్నాము. మాటగా చెప్పకపోయినా భూషణం అన్న మాటల్లో అర్థం నాకు స్పష్టంగా తెలిసింది. 'ఎదురుగా రోజూ నిన్ను చూస్తూ పొందకుండా వుండలేము. మనిద్దరికీ కుదరకపోతే కనీసం ఒకరి కంటికి ఒకరు కనపడకుండా వుండాలి' ఇవీ ఆయన నవ్వుతూ చెప్పిన కబుర్లు. నన్ను పోషించడానికి నా భర్త పడుతున్న యాతనలు నాకు తెలుసు. మళ్ళీ ఈ చోటు మారే యాతన ఆయన తట్టుకోలేరు.''

చెప్పలేక చెపుతున్న సీత కళ్ళలో తడి వెంక్రటావు మనసుకి కొరడాలా తగిలింది. మిమ్మల్ని ఇక్కడ్నించి పంపించేస్తాను అన్న బెదిరింపుతో తను ఆరంభించిన ఆ సంభాషణ అతన్నే ముల్లులా పొడుస్తున్నట్టుంది.

''పోనీలెండి — ఏది ఎలా జరిగిందో... భూషణం గారి దయ వల్ల ఆయనకి ఓ సైకిలు కొనగలిగాము. ఎప్పట్నించో దాచుకున్న పాత బంగారం అమ్మానని చెప్పాను. ఇప్పుడాయనకి ఆ సైకిలు విమానంలా వుంది. పొద్దున్నో గంట, సాయంత్రం ఓ గంట ఇంటి పట్టున వుంటున్నారు. మరీ కొట్టిన పాములా కాకుండా ఇదివరకటి కన్నా కొంచెం ఓపికొచ్చిందాయనకి'' అంది సీత నవ్వుతూ. ఆ నవ్వులోనూ కంటి తడే.

ఇంక తట్టుకోలేకపోయాడు వెంక్రటావు. వెనక్కి తిరిగి వచ్చేశాడు.

జీవితాల వివరాలన్నీ తెలుస్తున్నా మంచేదో, చెడేదో తెలియని సందిగ్ధం పట్టుకుంది వెంక్రటావుకి. తన జీవితంతో సహా అన్ని జీవితాలూ తప్పనిసరి ఒత్తిడిలాగే వున్నాయి. ఈ దుస్థితి తెలుస్తూనే వుంది. కానీ భూషణం దుస్థితి ఏమిటో అర్థం కావడం లేదు.

ప్రతి రోజూ భూషణం అవసరాలని తీరుస్తూనే వున్నాడు వెంక్రటావు. ఏ పనిలోనూ లోటు లేకుండా జాగ్రత్త పడుతూనే వున్నాడు.

* * *

ఆడ, మగా కలిసి పాతిక మంది వరకూ వున్నారు ఆ పార్టీలో. భూషణం తాలూకు స్నేహితులు, వ్యాపారస్తులు, ఆఫీసర్లు... మంచి హడావిడిగా వుంది బంగళా. వెంక్రటావుకి చేతి నిండా పని.

విచ్చలవిడిగా గడుస్తోంది రాత్రి. తాగి, తిని శ్రమించిన అలసటతో అందరికీ అర్థరాత్రి దాటింది.


భూషణం, సరిగ్గా అతని స్థాయి తెలిసిన మరో మిత్రుడు బాల్కనీలో నిలబడి తాగుతూ కబుర్లాడుకుంటున్నారు. ఏదేనా కావాలేమో కనుక్కుందామని వచ్చాడు వెంక్రటావు.

''డబ్బుదేముందిరా. తృప్తి కావాలి... తృప్తి. మనిష్ట మెచ్చినట్టు బతకాలిరా. అలా బతికినా ఒక్కోసారి బావుండడం లేదు. చూడు, ఇక్కడ నా లైఫ్ చూడు. ఏం తక్కువ. అన్నీ వున్నాయి. అయినా తృప్తిగా లేదు. చూడు అటు చూడు, ఆ మలుపులో ఓ పాకుంది చూశావా'' అన్నాడు భూషణం.

చిక్కటి చీకటిలో చిన్నగా వెలుగుతున్న దీపంతో వున్న పాకని చూశానన్నట్టు తలూపాడు భూషణం ఫ్రెండ్.

''అందులో సీతని, మంచి బలిసిన అమ్మాయుంది. చూడగానే మనసుపడ్డాను. తంటాలు పడి సాధించాను.

# సారీ ఫర్ ది ఇంటరప్షన్



పొద్దున్నే నీ యింట్లో అత్యుత్తమ అబద్ధంగా పొడుస్తుంది
నీ కదలికలపై చీకటి వెలుగుల ఇంద్రజాలం విసుర్తుంది
రోజువారీ నిట్టూర్పుల్నీ ఆశాభంగాల్నీ అపస్వర సంగీతాల్నీ
చాపలా పరుచుకుని బాసింపట్టు వేసుకో -
నీ కళ్ల ముందు రంగుల భూగోళం క్లాక్‌వైజ్‌గా తిప్పేస్తుంది
పోనీ నువు తలకిందులుగా కూర్చో -
దృశ్యాలన్నీ అప్‌రైట్‌గా చూపిస్తుంది
నీ చుట్టూ ఎవడికేం జరుగుతోందో వదిలేయ్ -
ప్రభువుగారి ఆవలింతనే వార్తగా ప్రసారిస్తుంది
ఈనా ఈనా విసవక్రా దీని పేరేమి

అదృష్టవశాత్తు రిపేరొస్తే దాని మేడ పొట్టని నువు విప్పదీస్తే
ధ్యాన వాల్మీకుల వెయ్యేళ్ల గడ్డాల దర్శన మిస్తుంది
క్రీ పూ ఇరవై క్రీ శ ఇరవై యొక్కటి శతాబ్దాలకి
లెక్క తప్పని వంతెన వేస్తుంది
సబ్బు బొమ్మల విరహాలూ శాటిన్ చీరల సరువాలూ
ఫలానా వాష్ కోసమో వాత్తెల్ల కోసమో
మనుషులు బడుద్ధాయలై పోవటాలూ
అయోమయానందమయ సీరియళ్లా మిళాయించి
నిన్ను సరుకుల లాహిరిలో చిల్లుపడవ వేస్తుంది

సరిగ్గా ఒక తాజా కుంభకోణ లగ్నాన
దొంగ వోట్ల తప్పెడు పర్మిట్ల మానభంగాల మూక హత్యల
సుముహూర్త సమయాన
బిగ్ బగ్స్ మత్తు మందూ బీద రైతు పురుగు మందూ
వెదుక్కునే వేళా విశేషాన
'మేరా భారత్ మహాన్' జోకు పేలుస్తుంది
ముద్దుగారే దొంగ మొహమూ
దొరల వాకిట్లో ధగిడీ
నీ దేశం చింపిరి తల మీద జలతారు మేలి ముసుగూ
ఈనా ఈనా విసవక్రా దీని వైనమేమీ

— పాపినేని శివశంకర్

ఆ అనుభవం చాలా కొత్తగా, తృప్తిగా వుంటుందను కున్నాను.. కానీ..చ్ఛ..''

''ఏం?'' అన్నాడు అతను.

''అంతా మామూలేగా. ఓ వెయ్యి ఖర్చు. ఏ ముందిరా దాని బతుకులో. రెండు చీరలు, కొంత డబ్బు. నీక్కావాలా చెప్పు పిలుస్తాను.'' అక్కడ్నించి నెమ్మదిగా వచ్చేశాడు వెంక్రటావు.

రాత్రి మూడవుతుండగా వెళ్ళేవాళ్ళు వెళ్ళారు. పడుకున్నవాళ్ళు పడుకున్నారు.

శత్రువు లాంటి ఆ పార్టీ ముగిసిన ఆ మేడ శ్మశానంలా వుంది వెంక్రటావుకి.

భూషణం సీత గురించి అన్న మాటలే గుర్తొస్తున్నాయి. ఆ మాటల్లోని తక్కువతనం, న్యూనత భయంకరంగా అతని మనసుని పట్టుకున్నాయి.

'కావాలని తాపత్రయ పడి గడిపిన ఆడదాని వల్ల అంత నీచ దృష్టి ఎందుకో! తల్లి పాలు తాగే శిశువు కున్నంత తృప్తి, ప్రేమా వుండాల్సిన స్త్రీ అనుభవాన్ని ఇంత నీచంగా చూసే వీడికి సంతోషం, తృప్తి ఎలా వస్తాయి. రావు. కలిసి గడిపిన ఆడదాన్ని అంత తక్కువగా భావించే వీడి బుద్ధే వీడికి అసంతృప్తి' అనుకున్నాడు వెంక్రటావు.

పార్టీలనీ, వినోదాలనీ.. అస్తమానం మారే ఆడాళ్ళతో వింత వింత అనుభవాలని, వెతుకులాట జీవితం గడుపుతూనే వున్నాడు భూషణం.